
పణాతుల రామచంద్రయ్య



# మలుపు

"అతడు అమృతపు ముద్ద .... చదువులో సరస్వతీ పుత్రుడు. చక్కదనంలో జయంతుడు. గుణంలో ధర్మరాజు. ధనంలో కుబేరుడు... ఇక అతడికేం తక్కువ?

"రాధా! ప్రపంచంలో ఇన్ని మంచి హంగులూ ఉన్న వ్యక్తుల్లో గర్వం లేని వాళ్లను ఎంతమందిని చూపించగలవు చెప్పు? కానీ... నువ్వు నమ్ముతావో లేదోగాని, ఇతడిలో ఆ దోషం కూడా లేదు రాధా! భాస్కరం నిగర్వి. ఏ ఆడది బంగారుపూజ చేసుకొని ఉందో, అతడికి భార్య కావటానికి.!..."

ఇంతవరకూ ఒకే ధోరణిలో చెప్పుకుపోతున్న

*'మనం నిత్యమూ నడిచే వీధులు ఎన్నెన్నో మలుపులు తిరుగుతాయి. ఒక మలుపు మనుషులను ప్రత్యక్షం చేస్తుంది. మరొక మలుపు అదృశ్యం చేస్తుంది. అలాగే జీవితంలో మలుపులూ.' ఇంతకూ ఈమలుపు చేసినది ఏమిటి?*

# మలుపు

పార్వతమ్మ ఇక్కడ ఆగి, రాధవేపు చూసింది... రాధ కళ్లల్లో నీళ్లు!

పార్వతమ్మ తెల్లబోయింది.

తమాషా ఏమిటంటే, ఆవిడ భాస్కరాన్ని గురించి యథాలాపంగా చెప్పటం మొదలుపెట్టి నప్పట్నుంచీ, ఆ మాటల్లో తనకేమీ ఆసక్తి లేనట్టుగా తలమరోవేపు తిప్పుకొని ఎటోచూస్తూ ఉండిపోయింది రాధ. కాస్సేపు అంతకు ముందే వేసుకున్న జడవిప్పి మళ్లీ వేసుకుంటూ, కాస్సేపు గోడలమీద పటాలను పరిశీలిస్తూ, కాస్సేపు పక్కనే ఉన్న తాంబూల పళ్లెంలోని తమలపాకులను లెక్కపెడుతూ కూచుంది. కాని అదంతా వట్టి నటన అనీ, తను చెబుతున్నదంతా రాధ మనఃఫలకం మీద శిలాశాసనమై నిల్చిందనీ గ్రహించి ఆశ్చర్యపడింది పార్వతమ్మ.

పార్వతమ్మ నలభై ఏళ్లు నిండిన పెద్ద ఇల్లాలయినా లోకజ్ఞానానికి పుట్టినిల్లు కాదు. వేదకాలం నాటి అమాయికపు ముత్తైదువలకు ఈ యుగపు ప్రతినిధిలా కనపడుతుంది ఆవిడ. ఆవిడ కావ్యాలూ, పురాణాలూ చదువుకున్నది. అయితేనేం? మనుష్యులను, అందులో తన తరగతికి చెందిన ఆడవాళ్లనే చదవటం ఆవిడకు చేతకాదు. ఇకముందు చేతనవుతుందన్న ఆశ కూడా లేదు.

ఇలాంటి పార్వతమ్మ రాధ అలా కన్నీళ్లు పెట్టుకోవటానికి కారణ మేమై ఉంటుందా అని ఆలోచించి ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. అదేమిటంటే: ఇంతకుముందు చాలాసార్లు రాధ ఆవిడతో చెబుతూ ఉండేది, తనకో అన్నయ్య ఉండే వాడనీ, మణిపూసలాంటివాడనీ, వాడు ఫస్టుఫారం చదువుతున్నప్పుడు పాము కరచి చని పోయాడనీను. ఇప్పుడు భాస్కరాన్ని గురించి వింటున్నప్పుడు, రాధకు చనిపోయిన తన అన్నయ్య మనసులో మెదిలి, "ఇప్పుడు వాడు జీవించిఉంటే భాస్కరం అంత వాడయ్యే వాడుగదా!" అని పించి ఉంటుంది.

అమాయికపు పార్వతమ్మ అంచనాప్రకారం ఇదే రాధ కన్నీళ్లు పెట్టుకోవటానికి కారణం.

ఈ నిర్ణయానికి వచ్చిన పార్వతమ్మ తానేదో శతావధానంలో ఒక క్లిష్టమైన సమస్య విప్పినట్టుగా సంతృప్తి పడింది. ఆవిడ మొహం నిండా వెలుగుబిళ్ళలు నింపుకుంటూ రాధవేపు దృష్టి సారించేసరికి రాధ అక్కడ లేదు!

• • •

అక్కణ్నుంచీ సరాసరి లేచివెళ్లి తన పడక గదిలో మంచంమీద వాలిపోయింది రాధ. ఆమెకు దుఃఖం ఆగటం లేదు.

భాస్కరం!

ఇంతవాడై తనను ఊరిస్తాడని తను కలలో నేనా అనుకోని భాస్కరం! చిన్నతనపు తూష్ణీం భావంతో తను ఓ గడ్డిపరకతో సమానంగా చూచిన భాస్కరం!!

ఎంత తేడా!

ఇది తనకు ప్రాయశ్చిత్తమా? తన మాత్సర్యానికి సమాధానమా? ఈ సమాధానాన్ని ఆ నాడు తనకు మాటల్లో చెప్పలేక, ఇన్ని సంవత్సరాల పురోగమన జీవితంలోకి అనువదించి చూపుతున్నాడా భాస్కరం?

తలుచుకుంటున్న కొద్దీ, గతం విప్పి కళ్ల ముందు పరుచుకుంటున్న కొద్దీ ఆమెకు బాధ ఎక్కువవుతున్నది.

అంతలో అక్కడికి ఆమె భర్త రామ్మూర్తి వచ్చాడు. అతడు రాగానే, రాధ ఏంచేస్తున్నా, ఏడుస్తున్నా సరే, లేచి నిలబడాలని అతడు పెట్టిన నియమం. రాధ ఎప్పుడూ ఈ నియమాన్ని పాటిస్తూనే ఉండేది. కాని ఈసారి మాత్రం మామూలు ప్రకారం లేచి నిల్చోలేదు. అందుకే రామ్మూర్తి రుసరుసలాడుతూ, "ఎందుకూ ఏడుపు?" అన్నాడు.

రాధ జవాబివ్వలేదు.

రామ్మూర్తి ముప్పయ్యేళ్ల వాడు. రెండేళ్ల క్రిందట రాధను రెండో పెళ్లి చేసుకున్నాడు. రెండో పెళ్లి వరుడైనా, సలక్షణమైన సంబంధమని రాధ నిచ్చారు. కాదామరి?... ఒంగోలు ప్రాంతంలో సుక్షేత్రంలాంటి పదెకరాలమాగాణీ, వందరూపాయల ఉద్యోగమూ, ఇల్లూ, బ్యాంకు అక్కౌంటూ...ఇవన్నీచూసి, 'శబాష్' అనుకున్నారు.



వాత్సల్యం
చిత్రం—పిరిశెట్టి అమృతరావు (పుల్లేటికుర్రు)

ఇన్ని హంగులున్న సంసారంలో ఉండీ రాధ ఎందుకు ఏడుస్తూందో, అలా ఏడ్చేందుకు ఏం తెగులు పట్టిందో (ఇది రామ్మూర్తి పరిభాష!) రామ్మూర్తికి అర్థం కాలేదు. అందుకే రెండో సారి రాధను రెట్టించి అడిగాడు: "ఎందు కేడుస్తున్నా"వని. రాధ సమాధానం చెప్పలేదు. సరికదా, చీదరించుకుంది.

రాధ కాపురానికి వచ్చినప్పట్నుంచీ భర్తను చీదరించుకోవటం ఇదే ప్రథమం. ఆ చీదరింపుతో రామ్మూర్తికి వచ్చిన కోపానికి ఇంకో సమయంలోనైతే రాధను మనిషిగానైనా లెక్కచెయ్యకుండా బాది ఉండేవాడు. కాని ఇప్పుడేకళనున్నాడో, లేక క్రోధారుణమైన రాధ మొహం చూసి జంకాడో—ఏమీ అనలేదు. సణుక్కుంటూ వెళ్లాడు.

అలా వెళ్లే భర్తవేపు నిర్లిప్తంగా చూస్తూ ఉండిపోయింది రాధ. అలా చూస్తూ గతాన్నంతా సింహావలోకనం చెయ్యటంగానీ, ప్రస్తుత స్థితికి విచారించటంగానీ చెయ్యదలుచుకోలేదు ఆమె. అది ఇన్నాళ్లూ పదేపదే చేస్తున్న పనే కావటం వల్ల, దానిమీద కూడా విసుగు పుట్టిం దామెకు. ఒకవేళ ఆమె ఏడవదలుచుకుంటే, ప్రస్తుతాన్ని గురించి కాక, జరగబోయేదాన్ని గురించి ఏడవాల్సి ఉంది. జరగబోయే దేమిటంటే— భాస్కరం రాక!

ఈ సంగతే ఇందాక పార్వతమ్మ చెప్పింది. భాస్కరం పార్వతమ్మకు దూరపు బంధువైనా కాడు. తెలిసినవాళ్ల అబ్బాయి. అతడు తెలంగాణా ప్రాంతంలో ఒక జిల్లా అధికారిగా పని చేస్తున్నాడు. పనిగా ఓ వారం రోజులు సెలవు పెట్టి ఈ ఊరికి వస్తున్నాడు.

ఈ వివరాలన్నీ కాకతాళీయంగా చెబుతూ పార్వతమ్మ ఇచ్చిన ఉపోద్ఘాతం రాధకు విద్యుదాఘాతమైంది. అలాగని పార్వతమ్మ మాటల్లో అసత్యంగానీ, అతిశయోక్తిగానీ రవ్వంతైనా లేదు. ఇది రాధకు కూడా తెలుసు. ఆ మధ్య స్వయంగా విచారించి తెలుసుకుంది. అప్పుడు భాస్కరానికి దగ్గర బంధువైన ఒకాయన ఈ ఊరికి వస్తే ఆయనను "మీ భాస్కరం ఏం చేస్తున్నాడూ?" అని అడిగింది తను పరిహాసంగా. ఆ అడగటం గర్వంతో అడిగింది. అందులోనే సగం జవాబు ఇమిడి ఉంది. ఆ జవాబేమిటంటే, భాస్కరం పొట్ట గడిచీ గడవని ఏదో ఒక 'నౌకరీ'తో కుస్తీ పడుతూ ఉంటాడని.

కాని ఆ బంధువు చెప్పిన సమాధానం అది కాదు. భాస్కరం ఇప్పు డొక పెద్ద తరహా గెజిటెడ్ ఆఫీసరని చెప్పాడు. ఎక్కడా అంటే, ఫలానా ఊళ్లో అన్నాడు.

ఆ జవాబు ప్రత్యక్షరంలోనూ పిడుగులు పిల్లలుపెట్టుకున్న ట్లనిపించింది తనకు. ఆ జవాబు తన వీపున చరిచి, తన గర్వాన్ని నేల మట్టంచేసి, "ఎందుకింత గర్వం నీకు? ఏమంత రాజా బ్రతుకు బ్రతుకుతున్నావని నువ్వు?" అని ధిక్కరించి అడిగినట్లయింది.

అవునుమరి—ఏం బ్రతుకు తనది? పైకి మెరుగులు దిద్దుకుంటూ, లోన గతుకులు పూడ్చుకోవటానికి అతుకులకోసం చీకట్లో తార ట్లాడే బ్రతుకు! కాని, ఈ బ్రతుకునే ఆ నాడు తను మనసారా వలచింది. ఇది వలచిన వధ్యశిల!

అప్పుడు నాన్న, మిగతావాళ్ళూ చేరి తీసుకొచ్చిన ఈ సంబంధానికి తను ఆమోదముద్ర వేస్తుంటే, అమ్మ అననే అన్నది. ఆమెకు అంతరాంతరాల్లో ఈ సంబంధం సుతరామూ ఇష్టంలేదు. "కాస్తంత ముందూ వెనకా ఆలోచించుకో రాధా! అది రాక్షసు లవజ్ఞ. పైగా రామ్మూర్తి మొదటి భార్య చావును గురించి ఆ ఊళ్ళో పదిమందీ పది రకాలుగా అనుకుంటారు. చూస్తూ చూస్తూ అగాధంలో దూకడం అంత మంచిదికాదు..." అంది. ఆమె మాటలు తను ఖాతరు చెయ్యలేదు. మబ్బులు కూడా చెప్పిచూసింది. ఊహుఁ. ఆఖర్ని ఒకరోజు భాస్కరమే తన దగ్గరికివచ్చి, తనతోకాకుండా ఎవరితోనో చెబుతున్నట్టుగా, "ఏమీదే ఇన్నాళ్ళూ ఆశలు పెట్టుకున్నాను రాధా...!" అన్నాడు తల వంచుకుని. తనకు నవ్వొచ్చింది. కోపం వచ్చింది. "ఏమిటి భాస్కరం ఆ ఆశలు?" అంది. అలా ఎందుకు అన్నదంటే, అందుకు జవాబుగా "నన్ను పెళ్ళిచేసుకుంటా వనుకున్నాను రాధా" అని భాస్కరం అంటే, అతణ్ణి హాస్యం చెయ్యాలని! "అలా ఎలాగనుకుంటావు భాస్కరం? ఏం పొత్తమతు ఉన్నదని చేసుకోను నిన్ను?" అని అందామని! కాని భాస్కరం అందుకు అవకాశం ఇవ్వలేదు. సమాధానం ఇవ్వకుండా లేచివెళ్ళాడు, మౌనంగా, దీనంగా.

అతడప్పుడు ఎంత హృదయభారాన్ని పైకి పొంగనీకుండా అదిమిపెట్టుకున్నాడో అనిపించి తనకు జాలివేసిన మాట వాస్తవం. కాని, తన 'ఇంటర్మీడియేట్' విజ్ఞానంతో ఆ జాలినంతా ఆవిరిచేసి ఆకాశంలోకి పంపించేసి, అతడి దుఃఖానికి తన బాధ్యత ఏమీ లేదనుకుని స్థిమితపడిన మాట కూడా అంతే వాస్తవం!

అందుకు తనకు పరిస్థితులు కూడా కూడి వచ్చాయి అప్పట్లో. భాస్కరం ప్రాధేయపడినట్లే రామ్మూర్తి కూడా ప్రాధేయ పడ్డాడు తనను. వాళ్ళిద్దరి అర్హతలను బేరీజువేసుకుని, రామ్మూర్తికి వేసింది తన ఓటు, కాదు—రామ్మూర్తి సంపదకు! కాని, తనమీద కినిసిన అంతరాత్మకు తాను చెప్పుకున్న సమాధానం వేరు. "ఇద్దరు వ్యక్తులు తమను పెళ్ళి చేసుకోవలసిందిగా అడుగుతున్నారు నన్ను. ఇద్దర్నీ ఎలా చేసుకోను...? రామ్మూర్తి మీద మనసు నిల్చింది...భాస్కరం మీద అభిమానం ఉంటే, అది వేరే విషయం..." అనుకుంది.

అప్పుడు తను మోసపోయింది. దానికితగ్గట్టు రామ్మూర్తి ఎంత నేర్పుగా నటించాడని! పెళ్ళి చూపులంటే తన కసహ్యమనీ, తనొక్కడే వచ్చి అమ్మాయిని చూచి పరస్పరం భావాలు వ్యక్త పరచుకోవాలనీ అతడు తన వాళ్ళతో చెప్పాడని విన్నప్పుడు తను నిజంగా సముద్రమల్లే పొంగిపోయింది! 'రెండోపెళ్ళివాడైనా ఆయన కిన్ని అభ్యుదయ భావా లున్నాయన్నమాట!' అని అతణ్ణి మనస్సులోనే ప్రశంసించుకుంది.

ఆ తరువాత అతడితో ఏకాంతంగా మాట్లాడినప్పుడు కూడా ఎంతైనా గాంభీర్యం ప్రదర్శించాడు రామ్మూర్తి. ఎన్నో మాటలు చెప్పాడు. తన దృష్టిలో స్త్రీ ప్రపంచానికి అధిదేవత అన్నాడు. ఇలాంటి గౌరవనీయురాలైన స్త్రీని, నెత్తిన పెట్టుకు పూజించాల్సిన స్త్రీని ఈ రోజుల్లో పురుషులు ఎందుకింత చులకన చేస్తున్నారో తనకు బోధపడటం లేదన్నాడు. నిజానికి రెండో పెళ్ళి చేసుకోవటం అతడికి ఇష్టంలేదట. కానీ అతనిభార్య చనిపోయేటప్పుడు—అతడు మళ్ళీ పెళ్ళిచేసుకుని సంతానాన్ని పొందేటట్టూ—ఆ సంతానంలో ఒక ఆడపిల్లకు ఆవిడ పేరు పెట్టుకునేటట్టూ ఒట్టు వేయించుకొని మరీ చనిపోయిందట. అందుచేత, కేవలం ఆవిడ ఆత్మశాంతికోసమే అత డిప్పుడీ ప్రయత్నానికి పూనుకోవటం!

ఇదంతా చెప్పాక ఆఖర్ని, "నా అర్హతలూ, అనర్హతలూ ఇవి. నన్ను చేసుకోవటానికి మీరు ఇష్టపడతారా?" అని రామ్మూర్తి అడిగినప్పుడు, "ఎంత మెత్తని మనిషి!" అనుకున్నది తాను. భార్యగా తాను వాంఛించేదంతా ఈ ఒక్క వ్యక్తి నుంచే పొందగలదనీ, జీవితంలో ఏ శుభోదయం కోసమో తనకీ సంబంధం కాబోతున్నదనీ భావించుకుంది. ఆ సంభ్రమంలో కూడా తనకు భాస్కరం సంగతి లేశమాత్రం మనస్సులో మెదలకపోలేదు. ఆ జ్ఞాపకం మరుక్షణంలోనే చెరిగిపోయింది! మరిగిపోయింది—తన స్వప్న వీచికల ధాటికి.

కాని...

ఆ స్వప్న వీచికలు మరుమరీచికలనీ, అప్పుడు రామ్మూర్తి చెప్పిన మాటలన్నీ నీటి మూటలనీ తెలుసుకునేందుకు ఎంతోకాలం పట్టలేదు!

పెళ్ళయినాక తన నిజస్వరూపం చూపించాడు రామ్మూర్తి. అభ్యుదయ భావాల తెరల వెనుక పేరుకుపోయిన సంకుచితత్వం!—అబ్బ!! తను భరించలేక పోయింది. 'పయోముఖ విషకుంభం', 'మేకవన్నె పులి!', 'పూలదండగా తన తల దాల్చిన సర్పం!'... ఇలా ఎన్ని పేర్లు చెప్పుకున్నా, భాషే చాలదనిపించింది తనకు!

కాని ఏం లాభం?

రామ్మూర్తి ఇప్పుడు తన భర్త! తన జీవితానికి శాసన కర్త! ఆ మాటను అక్షరాలా రుజువు చేసుకుంటూ, తనను శాసిస్తున్నాడు. తనను


స్థాపితం 1920
రెడ్డి అండ్ కో.
గోపాలపురం
తూ. గో. జిల్లా
కుష్ఠు బొల్లి
మేహపాద
వగైరా చర్మ
సుఖ వ్యాధులకు
ప్రత్యేక చికిత్స.
శాస్త్రీయ-

బ్రాంచిలు: వాల్తేరు ఆర్. ఎస్.
సికింద్రాబాద్ — 3560 కింగ్సువే



ఐటెక్స్
(కాటుక)
శాస్త్రీయంగా
తయారైనది.
అరవింద్
బింది
కుంకుమ చాదు
6 ఆకర్షణీయ
మైన రంగులలో లభించుచున్నవి.
అరవింద్ లేబరేటరీస్
పి. బి. 1415, మద్రాసు-17.
తెలంగాణా జిల్లాలకూ హైదరాబాదుకూ
మినహా ఆంధ్రప్రదేశ్‌కు ఏజెంట్లు:
ప్రగతి ఏజెన్సీస్,
పులిపాటివారి వీధి, విజయవాడ-1.

దగ్గు నివారిణి
తిరగపెట్టకుండా దగ్గును యిప్పుడే నిర్మూలించండి. ఖరీదు రు. 157—15.
ట్రయల్ 12—13.
చెవుడు
పూర్తి కోర్సు ద్వారా చెవుడు పూర్తిగా నయమగును. పూర్తి కోర్సు రు. 147—15.
ట్రయల్ రు. 17—97న.పై.
కంటిలోని పొర
పక్వమైనా, కాకపోయినా, ఆపరేషన్ లేకుండా రు. 87.97 న. పై.లకు తప్పక నయం చేయుబడును.
జాబులు ఇంగ్లీషులో వ్రాయండి.
DR. SHERMAN, F.C.S.
181, R. N. Guha Road, Calcutta-28.

మోక్కాపెట్టి గొంతుకోశాడు. ముందుగా బయట పడితే తను లొంగదని, వయ్యారంతో స్వాధీనం చేసుకొని, వెతకించి, లేపించి, హింసించి చంపాడు.

తప్పు తనదే. ఇది పండిన పాప ఫలం!

రాధ ఏడవబోతే కన్నీళ్లు ఓ పట్టాన రాలేదు. దిండులో తలదూర్చి పడుకుంది.

• • •

తను భాస్కరం గురించి చెబుతున్నప్పుడు



దొంగలనుండి, క్రూరమృగములనుండి మిమ్ము రక్షించుకోండి. నటభోజనములు, యాత్రలు, నాటకములకు చాలా ఉపయోగ మైనది. ఆటోమేటిక్ ఆరు తూటాలుగంది. తేలికైనది. దీని పెట్టుబడుపు, ప్రకాశమైన మంట మిమ్ము ఆపదలనుండి రక్షించును.

| | | | | |
|---|---|---|---|---|
| | నెం. | 333 | 444 | 555 |
| ధర | రు. | 6 | 8 | 13 |

25 తూటాలు ఉచితం: అధికంగా ప్రతి 100 తూటాలు రు. 3. లెదరు కేసు రు. 4. పోస్టేజి రు. 2. లైసెన్సు అనవసరం. ఒకే ప్యాకింగులో రెండు రివాల్వర్లు తెప్పించుకున్న పోస్టేజి, ప్యాకింగు ఉచితం.

BHARAT COMMERCIAL STORES
(APW) JULLUNDUR CITY.

# మలుపు

రాధ అలా కన్నీళ్లు పెట్టుకుంటూ లేచి వెళ్లి పోయినప్పటినుంచి పార్వతమ్మకు మనసు నిలవ లేదు.

జీవితంలో ఎదురుగా వచ్చిపడే పెనువిపత్తులకు మహాదుఃఖాలకే చలించిపోయే స్వభావం కాదామెది, ఏమాత్రం నిగ్రహంలేని పిల్లలాగే అంటూ ఉంటుంది ఆవిడ. అందుకే ఆవిడకు రాధ అంటే ప్రత్యేకాభిమానం, ఆపేక్ష. రాధ ఇలాంటి అప్రాచ్యపు పనుల్లో వచ్చి పడ్డందుకు ఆవిడ రాధకన్నా ఎక్కువ బాధ పడుతూంటుంది. ఆవిడకు కొడుకులున్నారు. కూతుళ్లు లేరు. ఆ కొరతను రాధద్వారా తీర్చుకుంటూ తృప్తిపడటం నేర్చుకుంది.

ఒకసారి వెళ్లి రాధను పలకరించి రావాలను కుంది పార్వతమ్మ.

ఆవిడ ప్రయాణమై వీధి వాకిట గడప మెట్లు దిగుతూండగా పోస్టువాడుఎదురయ్యాడు. "ఏమన్నా ఉత్తరాలున్నాయా?" అని అడిగితే వాడు టెలిగ్రాం తీసి ఇచ్చాడు!

పార్వతమ్మ కలవరపడ్డది. టెలిగ్రామంటేనే భయం ఆవిడకు. వణికేచేతులతో సంతకం పెట్టి టెలిగ్రాం తీసుకుంది. అయినా చదివేందుకు ధైర్యం రాలేదు. సమయానికి ఇంట్లో మగవాళ్లెవరూ లేరు. ఆవిడ టెలిగ్రాం కాగితం మడతైనా విప్పకుండా అలాగే పట్టుకొని రాధ దగ్గరికి బయల్దేరింది.

పార్వతమ్మ ఇంటినుంచి రాధ అత్తగారింటికి వెళ్లాలంటే వీధి మలుపు తిరగాలి. ఆ మలుపు తిరగ్గానే, ఓ ఏభై గజాలదూరంలో రాధ అత్తగారిల్లు కనబడుతుంది. అది రెండంతస్తుల పాత డాబా. రామ్మూర్తి లాగే అతడి పూర్వీకులందరూ దమ్మిడీకి చిల్లపెట్టే ఆసాములని చాలామంది చెప్పుకుంటారు. అలా తూతూ మంత్రంగా సంపాదించేవి నిలవచెయ్యబట్టే ఆ మాత్రం కొంపాగోడూ అమిరినాయంటారు.

ఈ రోజు పార్వతమ్మ అలా వీధి మలుపు తిరగ్గానే, ఆ డాబా రెండో అంతస్తులో ఉన్న రాధ గదికేసి చూసింది. రోజూ అనేకసార్లు రాధ ఆ గదిలో కిటికీవద్ద కూచుని వీధిలో తిరిగే మనుషులను, మబ్బులు లేని ఆకాశాన్ని చూస్తూ ఉండేది. కాని ఈ రోజు రాధ అక్కడ కనిపించలేదు! పార్వతమ్మకు భయమూ, ఆశ్చర్యమూ కలిగాయి.

కొంపదీసి రాధ ఏలాంటి అఘాయిత్యమూ చెయ్యదు కదా! ఏమో, రాధలాంటి మనుషులు వర్షాకాలపు వాగులాంటి వాళ్లు. క్షణంలో పొంగుతారు, క్షణంలో కుంగుతారు. ఈ రెండు పద్ధతుల్లోనూ వాళ్లను ఆపటం అసాధ్యమైన పని.

రాధ కన్నీళ్లు పెట్టుకోవటాన్ని గురించి ఇంతకు ముందు ఏర్పరచుకున్న అభిప్రాయం ఇప్పుడామెకు సంతృప్తి నివ్వటం పూర్తిగా మానేసింది.... మరి భాస్కరానికీ, రాధకూ ఏమిటి మానసికానుబంధం? ఇంత ఆత్మీయురాలైన తన దగ్గరే రాధ ఈ విషయాన్ని దాచిపెట్టిందా?

ఈ ప్రశ్నలకు ఆవిడ సమాధానంకోసం ఆలోచించే లోపలే రాధ ఇల్లు వచ్చేసింది. పార్వతమ్మ మేడమెట్లెక్కి రాధ గదివద్దకు వెళ్లేసరికి గది తలుపు వేసిఉంది.

పార్వతమ్మ టక్కున ఆగిపోయింది. లోపల్నుంచి రాధ గొంతుక వినిపిస్తోంది.

"శ్రీకృష్ణుడు రుక్మిణిని ఎత్తుకుపోయినట్లు లేక ఏ రాక్షసుడో ఒక రాచకన్నెను చెరపట్టి లాక్కుపోయినట్లు నువ్వానాడు నన్ను ఎందుకు తీసుకుపోలేదు భాస్కరం? పౌరుషం పొంగిపోయే కబుర్లు ఎన్నో చెప్పేవాడివే?—అవన్నీ ఏమయినయ్? అవన్నీ ఆ రోజు నేనిచ్చిన జవాబుతో పటాపంచలైనాయని చెప్పి తప్పుకో జూస్తావేమో! వీల్లేదు...

"భాస్కరం! నిజంగా నువ్వే నన్ను మోసం చేశావేమో! నా జీవితమే నాకు బుద్ధి నేర్పాలని, నా అనుభవాలే నాకు ప్రాయశ్చిత్తాలు కావాలని నువ్వు అనుకుని ఉంటావు... పోనీలే, ఏ జీవితమైనా చక్కగా మూడు పూవులూ ఆరు కాయలూ అయితే, అదే చాలునాకు.

"అయినా ఇందులో నా తప్పేం లేదు భాస్కరం! ఎందుకంటావా? మనం నిత్యమూ నడిచే వీధులు ఎన్నెన్నో మలుపులు తిరుగుతాయి. ఒక మలుపు మనుషులను ప్రత్యక్షం చేస్తుంది. మరొక మలుపు అదృశ్యం చేస్తుంది. అలాగే, జీవితంలో మలుపులు. ఒక్కొక్క మలుపు మనుషులను కలిపితే ఒక్కొక్క మలుపు విడదీస్తుంది. నా జీవితం మలుపు తిరిగింది. అది

(తరువాయి 49 వ పేజీలో)

రాంతీర్థ బ్రాహ్మీ నూనె

(స్పెషల్ నెం. 1) రిజిష్టర్డు



చుండు, వెంట్రుకలు రాలుట మాన్పి, వెంట్రుకలను పట్టువలె మృదువుగాను, కాంతిగాను నల్లగాను చేయు అమూల్యమైన హెయిర్ టానిక్. ఇది మెదడును చల్లబరచి, జ్ఞాపకశక్తిని పెంపొందించి కండ్ల వేడిమి, నిరంతర శిరోబాధ తగ్గించును. హాయిగా నిద్రపట్టించును.

రాంతీర్థ హెయిరాయిల్ పెద్ద సీసా: రు. 4/50, చిన్నసీసా: 2/25.

యోగాసన చారు: సచిత్రమైన మా యోగాసన చిత్రపటంలో చూపిన వివిధ యోగాసనముల నిరంతర అభ్యాసము వల్ల ఆరోగ్యకరమైన మంచి శరీరదార్ఢ్యత పొందండి.

పోస్టేజితో ధర రు. 3/—లు మాత్రమే.

శ్రీ రాంతీర్థ యోగాశ్రం

దాదర్, బొంబాయి — 14.

# మలుపు

(12 వ పేజీ తరువాయి)

విడదీసే మలుపు—నిన్నూ నన్నూ విడదీసింది. అంతే....కాదంటావా?"

పార్వతమ్మకు అయోమయంగా ఉంది. రాధ మాట్లాడేది ఎవరితో? భాస్కరంతోనా? నాలుగు రోజుల్లో వస్తున్నానని రాసిన భాస్కరం అప్పుడే ఎలా వచ్చాడు?

ఆవిడకేం తోచలేదు. ఉండటమా, తిరిగి వెళ్లటమా అని ఓ నిమిషంపాటు సందిగ్ధంతో ఉండి, తరువాత తలుపు తట్టింది.

రాధ తలుపుతీసింది. ఆమె కళ్లు ఎర్రగా ఉన్నాయి. నిరాశాభరితమైన జీవన పథంలో చిరకాలం పయనించి గట్టిపడిన మనసులు తాలూకు వెలుగూ, స్థిమితమూ ఆమెలో కనబడుతున్నయ్.

పార్వతమ్మ గది నాలుగు మూలలా చూచింది. ఎవ్వరూ లేరు!

"ఎవరితోనమ్మాయ్,మాట్లాడుతున్నావు?"

"వాతోనే పిన్నీ!"

"అదేమిటమ్మాయ్? పిచ్చి పట్టలేదుగదా నీకు" అంది పార్వతమ్మ భయంగా.

రాధ నవ్వింది.

"లేదుపిన్నీ! ఇంతవరకూ పట్టిన పిచ్చి ఇప్పుడు వదిలి పోయింది. ఇన్ని రోజులూ మనుషులు నాతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. వాళ్లను తోసివచ్చాను. ఇప్పుడు నాకై నేను మాట్లాడుదామనుకుంటే, మాట్లాడే మనుషులు దూరమయ్యారు. ఇక నాతోకాక ఎవరితో మాట్లాడను?"

"నానీ నాతో మాట్లాడకూడదా?"

"నీతో మాట్లాటంవల్ల ఈ దాహం తీరేదికాదు పిన్నీ."

ఈ మాట పార్వతమ్మకు బాధ కలిగించింది. రాధతో ఈ దిశలో సంభాషణ పొడిగించడం ఆవిడకు ఆనందకరంగాలేదు. అందుకని—

"ఈ టెలిగ్రాం ఏమిటో చూడు రాధా!" అని టెలిగ్రాం చేతికిచ్చింది.

రాధ టెలిగ్రాం విప్పి చదివింది. చదువుతూండగానే ఆమె మొహం వివర్ణమయింది. కళ్లలో నీళ్లు ఉబుకుతున్నయ్. ఇదిచూచి పార్వతమ్మ మరీ భయపడింది. అసలు టెలిగ్రాం అంటేనే ఆవిడకు గుండెలు కొట్టుకుంటాయి!

"ఎక్కణ్ణుంచి రాధా?" అంది భయంగా.

"భాస్కరం దగ్గర్నుంచి..."

"ఏమని?"

"ఏదో కారణాల వల్ల కార్యక్రమం మార్చుకున్నాడట పిన్నీ! ఈరోజు మధ్యాన్నమే వస్తాడట ఎక్స్‌ప్రెస్‌లో." రాధ కళ్లలో నీళ్లు కారుతున్నయ్.

"ఎందుకమ్మాయ్ కన్నీళ్లు?... ఇంకా నీ మవి రాలేదు భాస్కరం?" పార్వతమ్మ ఇంకా స్థిమిత పడలేదు.

"ఇంకేం లేదు పిన్నీ. మధ్యాన్నం వస్తాడట. మళ్లీ రాత్రిబండికే తిరిగి వెడతాడట." రాధ కంఠం రుద్ధమయింది. ఆమె ఇందాకటిలాగ దుఃఖాన్ని పార్వతమ్మ ముందు దాచుకోవాలని ప్రయత్నించలేదు. వెక్కివెక్కి ఏడవ నారంభించింది. చేత్తో పట్టుకున్న టెలిగ్రాం కాగితం మీద ధారాపాహికంగా ఆమె కన్నీళ్లు పడి, చాలా భాగం నానిపోయింది.

"ఏమిటో ఈ కాలపు కుర్రాళ్లు—అంతా టెలిగ్రాములమీద నడుపుతుంటారు" అంది పార్వతమ్మ. ఈ మాటను టెలిగ్రాంమీద వ్యాఖ్యానంగా గాక, రాధ మనస్సులోని బాధాకరమైన విషయాన్ని కాస్సేపు మరపిద్దామన్న తలంపుతో అంది. కాని రాధ జవాబివ్వలేదు. దుఃఖిస్తూనే ఉంది.

"నీ మనస్సులోని దేమిటో నాకు చెప్పకూడదా రాధా! ఇందాకా భాస్కరాన్ని గురించి చెప్పినప్పుడూ కన్నీళ్లు పెట్టావు. ఇప్పుడు భాస్కరం వస్తాడంటేనూ ఇలా దుఃఖిస్తున్నావు... అతణ్ణి గురించి నీ మనస్సులో ఎలాంటి భావాలైనా ఉన్నాయామ్మా .... చెప్పరాదా! చెప్పటం వల్ల నీ బాధ నేను తీర్చలేకపోయినా, కనీసం దుఃఖాన్ని పెళ్లబోసుకున్నామన్న తృప్తి అయినా ఉంటుంది గదా!..."

రాధ ఏడుపు మానటానికి ప్రయత్నిస్తూంది. చంటిబిడ్డలా ఏడుస్తున్న ఆమె పట్ల ఒక మాతృభావం లాంటిది ఉదయించింది పార్వతమ్మకు. ఆవిడ పరుపుమీద బోర్లా పడుకొని ఉన్న రాధను దగ్గరికి తీసుకొని, లాలిస్తున్నట్టుగా పొదివి పట్టుకుంది. యుగాల పర్యంతం ఆ మాత్రం అమరాగం కోసం వెంపర్లాడుతున్న దానికిమల్లే, ఆవిడ హృదయానికి హత్తుకుని, భుజం మీద తలపెట్టి ఉండిపోయింది రాధ.

"చెప్పవా, రాధా!"

"చెబుతాను పిన్నీ! ఇక్కడ నీవు తప్ప నా కింకెవ్వరున్నారు గనుక?.... కాని ఒక్క షరతు పిన్నీ!"

"పిచ్చిదానా! ఈ సంగతి నే నెవరితోనేనా చెబుతాననేనా?... ఇదేనా, నీ పిన్నిని గురించి నువ్వు తెలుసుకున్నది?"

"అది కాదు పిన్నీ! నువ్వీ సంగతి ఎవరితో చెప్పినా నేను బాధ పడను. పది జన్మలకు సరిపడిన బాధనంతా ఒకే జన్మలో అనుభవిస్తున్న దానికి ఇంకా బాధేమిటి?.... కాని, ఇప్పుడు భాస్కరం వచ్చినప్పుడు అతడితో మాత్రం నువ్వు నా సంగతి చెప్పకూడదు..."

"అదేమిటి రాధా!"

"అవును పిన్నీ! పొరబాటుగానైనా చెప్పకూడదు. ఒకవేళ అత డడిగినా, నేను జీవించి ఉన్నానన్న సంగతే నీకు తెలియనట్లు నటించాలి... ఆమాత్రం చెయ్యలేవా పిన్నీ ... చేస్తానని చేతిలో చెయ్యి వెయ్యి."

చేతిలో చెయ్యివేసింది పార్వతమ్మ. రాధ ఏదో పెద్ద బరువు తొలగిపోయినట్టు నిట్టూర్పు వదిలింది. పార్వతమ్మ దావాగోడ తలుపు గడియ పెట్టి వచ్చి, "చెప్పు..." అంది.

మనుషుల నిత్య జీవితానికి సరిపడ్డ వేడినీ, చురుకునూ కూడా ఇవ్వలేనంత చల్లగాఉంది వాతావరణం. భగ్నజీవితంలా చెల్లాచెదరైఉన్న మేఘ సందోహాన్నంతటినీ ఒక పక్కకు చేర్చుకొని, సూర్యుణ్ణి లోకానికి కనబడనీయకుండా చెయ్యాలని తాపత్రయ పడుతూంది ఆకాశం. ఆ కైతల్యానికి ఆవేశాలు చచ్చి, నిశ్శబ్దం పేరుకుపోతూంది జగమంతా.



ఆశాజ్యోతి
చిత్రం—సి హెచ్. వీరరాఘవమ్మ (కాకినాడ)

## విజ్ఞప్తి

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురణార్థం కథలు, గేయాలు, ఫోటోలు, చిత్రాలు మున్నగునవి పంపేవారు పేరు, పూర్తి చిరునామా స్పష్టంగా వ్రాయవలెనని ఉన్నది. ప్రచురణకు అంగీకరించే పక్షంలో ఆసంగతి తెలియపరచడము, ప్రచురణార్హం కాకపోతే త్రిప్పి పంపడము దుస్తరం అవుతున్న కారణంచేత ప్రత్యేకంగా ఈ విజ్ఞప్తి చేస్తున్నాము.

—ఎడిటర్

ఈ ఆకాశం, ఈ శైత్యం, ఈ నిశ్శబ్దం, గతంలోని ఇదే రకమైన క్షణాలకు చేరువగా నిలిపినాయి రాధను.

ఆమె చెప్పసాగింది.

"జీవితాన్ని గురించి ఇన్ని రకాల ఆలోచనలు ఆనాడు లేవుపిన్నీ! అవి బంగారు క్షణాలు. అప్పుడు పధ్నాలుగేళ్ళుంటాయినాకు. అయినా పసిపిల్లలా ప్రవర్తించేదాన్ని. సెలవుల్లో ఊరికి వచ్చి ఉన్నప్పుడు, ప్రతిరోజూ నేనూ తోటి ఆడ పిల్లలూ కలిసి వెళ్ళి ఊరిబయట కోవెలవద్ద దాగుడుమూత లాడుకునే వాళ్ళం. ఆ కోవెల, కోవెల ప్రాకారమంతా అల్లుకుపోయిన గన్నేరు పూలపొదలూ భగవంతుడు మాకే గుత్తకిచ్చా డని పించేవి.

కాని ఆపూలపొదల మధ్య ఆటల ఆనంద మంతా ఒకఎత్తు. ఆ ప్రాకార శిథిలాలమధ్య నుండి హఠాత్తుగా భాస్కరం సాక్షాత్కరించి నప్పుడు కలిగే ఆనందం ఒక ఎత్తూనూ. భాస్క రం కూని రాగాలు తీసేవాడు. పాటలు పాడే

# మలుపు

వాడు. వెన్నెల విరిసినట్లూ, పాలవెల్లి ప్రవ హించినట్లూ ఉండేది అతడిపాట.

కాని, అలా అతడు కనబడగానే, అతడిపాట వినబడగానే, 'అదుగో రౌడీ!' అనేవాళ్ళు నాతోటి ఆడపిల్లలంతా. నేను బాధపడేదాన్ని. అఖరికి సుబ్బులు కూడా అలాగే అనేది. సుబ్బులు ఎవరంటావా, పిన్నీ? ఎవరైతేనేంలే, ఓ స్నేహి తురాలు. అప్పుడు సుబ్బులు కూడా అతణ్ణి 'రౌడీ!' అనీ, 'రౌడీ బాసిగా' డనీ అనేది.

కాని, వాళ్ళ కంటికి రౌడీగా కనిపించిన భాస్కరం నాకుమాత్రం, బృందావనాన వేణు గానం ప్రవహించే కృష్ణమూర్తిలా కనిపించేవాడు. ఆ ఎర్రని బొద్దైన ఒళ్ళూ, కళ్ళూ, నవ్వూ, ఆ చింకిబట్టలూ చూసి ఏ గంధర్వుడో జన్మాంతర శాప వశాత్తూ ఇలా జన్మించా డనుకునేదాన్ని.

ఆ భావనే అతణ్ణి నా దగ్గరికి తెచ్చింది. అభిమానించాను. చనువిచ్చాను. మమతలుపెంచు కొనిచ్చాను. ఆశ్రయించాను, పందిరివిూదికి పాకే తీగల్లే. అతడూ ఆ భరోసాతోటే, 'ఇక రాధ నాది, నా సొత్తు' అనుకున్నాడు. మాస్నేహాన్ని అమ్మ కంటగించుకునేది. సుబ్బులు వేళాకోళం పట్టించేది. కాని ఆ వేళాకోళం మధురంగా ఉండేది నాకు.

అంతటి ప్రేమబంధం, ఆశలు, అన్నీ సమూలంగా నశించినై... కారణం నేనేపిన్నీ! నేనే ....ప్!"

పశ్చాత్తాపం భారమై, ఓ మారు గట్టిగా ఏడవాలని ఆశపడ్డది రాధ, ఏడిస్తే బాధ అంతా విశ్వానరూపంలో వెళ్ళిపోయి హృదయం తేలిక పడుతుందని. కాని ఆమె ప్రయత్నం సఫలం కాలేదు. ఆమె కిటికీలోంచి వీధిలోకేచూసింది.

ఆశ్చర్యం!

భాస్కరం వస్తున్నాడు.

"పిన్నీ! భాస్కరం" అంది రాధ.

"ఆ!" అంటూ పార్వతమ్మ కూడా కిటికీ దగ్గరికి వచ్చింది. భాస్కరం జీవ్‌బాగ్ చేత పట్టుకుని నడిచి వస్తున్నాడు. రాధ, భాస్కరాన్ని చూచి దాదాపు ఏడేళ్ళయింది. అయినా ఆమె తేలిగ్గా గుర్తు పట్టింది... ఆ రంగూ, కళ్ళూ, పెదాలూ—మార్పులేదు!

భాస్కరం ఇవేమీ గమనించ కుండా మాటిగా నడిచివెళ్ళుతున్నాడు.

"అతడే పిన్నీ!...." అంది రాధ ఉద్వేగాన్ని అపుకుంటూ.

"ఊరుకోమ్మా!" అంది పార్వతమ్మ. మళ్ళీ ఆమె భుజంమీద చెయ్యివేసి బుజ్జగిస్తూ, "అన్నట్టు మరిచాను...ఒంటిగంటయిందికదూ? అతడు ఎక్స్‌ప్రెస్‌లో వచ్చాడల్లేఉంది. మరి వెడతా నమ్మాయీ, అతడికావలసిన ఏర్పాట్లన్నీ చూడాలి. మళ్ళీ రేపు వస్తానే" అంటూ బయ ల్దేరింది పార్వతమ్మ.

"పిన్నీ! నా కిచ్చిన మాట మరిచిపోవుగదూ!" అంది రాధ దీనంగా.

ఆ మాటకు పార్వతమ్మకు కూడా ఏడుపొచ్చి నంత పనైంది.

"మరిచిపోను రాధా! నిన్ను గురించి అతడితో చెప్పనే చెప్పను... నువ్వు బాధపడకు. నువ్వు చెప్పినబదాన్నిబట్టి—మీ ఇద్దరూ పెళ్ళిచేసుకోవా లనుకున్నారు. కాని పరిస్థితులు అడ్డువచ్చాయి. లేదా, మనుషులు అడ్డుపడి ఉంటారు. అవునా? ఇది సహజమే తల్లీ! ప్రతి ప్రేమగాథా పెళ్ళి దాకా సాగిపోతే, ఇక ఈ సినిమాలూ, నవలలూ, కథలూ ఎందుకు? ప్రపంచం ఇలా ఎందుకు నడుస్తుంది....."

—ఇలా చెప్పి పార్వతమ్మ మౌనంగా వెళ్ళి పోతూంటే, ఏమనాలో తోచలేదు రాధకు.

తను చెప్పేకథ నగంమాత్రంవిని,పూర్తిగా


**సినిమా నటులు**

మీరు సినీకారులుగాచేరి, నెలకు మంచివరుమానం పొందవలెనన్నచో నేడే మాకు వ్రాయండి. ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషు లేక హిందీలో వ్రాయవలెను.

**BOMBAY FILM SERVICE, (W.A.P.) PHAGWARA (N.R.)**

**డాక్టర్ వృత్తి చేయండి!**

ఇంటిలో విరామంగా కూర్చొని వుండేప్పుడు పోస్టల్ ట్యూషన్ ద్వారా, హోమియోపతి చదు వుకొని, గవర్నమెంటు రిజిష్టర్డు కాలేజిద్వారా డిప్లొమా పొం దండి. ప్రాస్పెక్టస్ ఉచితము.

వివరములకు వెంటనే వ్రాయండి:

**INDIAN HOMOEOPATHIC COLLEGE (A.W.P.) JULLUNDUR CITY**



**పూవు మీ అదృష్టం చెప్పగలదు**

నీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, ఆకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగు వానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మాపూచిప్పైన పంప బడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా ఉండనియెడల పైకం వాపసు చేయ బడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AW-3) Jullundur City**

విన్నాననుకుంటూ వెళ్లిపోయింది పార్వతమ్మ పిన్ని! పాపం! ఆ వెర్రిబాగుల మనిషికేం తెలుసు, ఇంకా చాలా కథ మిగిలిఉన్నదనీ, ఆ కథా శీర్షిక తన స్వయంకృతాపరాధమనీ!...

అప్పుడు—భాస్కరంతో స్నేహంగా ఉన్న రోజుల్లో—ఓ సాయంత్రం తను ఇంటికి వచ్చే సరికి, ఇంట్లో తన పెళ్లి మాటలు వినిపిస్తున్నాయ్. తనకు పెళ్లి సంగతి తెలియగానే ఒళ్ళు పులకరించింది. ఏదో పెద్దతనం అబ్బినట్లయింది.

ఆ పూట ఇంట్లో ఈ రామ్మూర్తి వాళ్ల సంబంధం గురించి మాట్లాడుకుంటున్నారు. నాన్నా, ఆయనతో కూడా వచ్చిన ఒక పెళ్లిళ్ల పేరయ్యా ఈ సంబంధాన్ని 'అపురూపం', 'బంగారం', 'అన్నివిధాలా...' మొదలైన పదాలతో వర్ణిస్తూంటే, అమ్మ అన్నింటినీ తోసి పారేస్తున్నది. అమ్మకు భాస్కరం అంటే అంత ఇష్టం లేకపోయినా, రామ్మూర్తి అంటేమట్టుకు మతరామూ ఇష్టంలేదు.


కానీతను ఇష్టపడ్డది. ఆతర్వాత రామ్మూర్తిని చూడటం, అతడితో సంభాషించటం జరిగాక తను పూర్తి అంగీకారాన్ని తెలిపింది. ఏ అదృశ్య శక్తి తనలో పనిచేసిందో అప్పుడు!... దాపరికం దేనికి? తను వలచింది, మనసా, వాచా—రామ్మూర్తిని కాదు, అతడిదని చెప్పబడ్డ స్థితినీ, హోదానూ. దాన్ని భాస్కరం పేదరికంతో పోల్చి చూచుకొని, "ఎక్కడికెక్కడా..." అనుకుంది. అప్పటిదాకా స్నేహితుడైన భాస్కరం భాసించే తేజస్సుతో, అందంతో, తన మనః ఫలకంమీద నిలిచే ఉన్నాడు. తను ఆ చిత్తరువును తుడిపేసింది. అంతరాత్మ అడ్డుపెట్టగా దానితో హోరాహోరీ యుద్ధంచేసింది...

"గడ్డిపూలుకూడా ఆకర్షణగానే ఉంటాయి. అలాగని వాటిని దండగుచ్చి తల్లో పెట్టుకుంటామా?..." అనుకుంది గర్వంగా.

భాస్కరం గడ్డిపువ్వా...?

అప్పట్నుంచే తనలో అహం ప్రజ్వరిల్లింది. ఆ అహంతో భాస్కరాన్ని దూరంగా ఉంచాలని ప్రయత్నించింది. సాధ్యం కాలేదు. ఇహ ఇది పనిగాదని ఓ అస్త్రం ప్రయోగించింది భాస్కరం మీద. అతడితో గిల్లికజ్జా పెట్టుకుని, పని మల్లే మాటా మాటా పెంచి, "రౌడీ!" అంది. జీవితంలో తను భాస్కరాన్ని "రౌడీ" అనటం, అదే మొట్టమొదటిసారీ, చివరిసారీను. చిన్నతనం నుంచీ తోటి పిల్లలంతా అతణ్ణి రౌడీ అనటానికి కారణం—అతడు మిగతావాళ్ళకు మల్లే అరువు బ్రతుకు బ్రదికేవాడు కాకపోవడమేననీ, ముగసిరి, స్వతంత్రం ఉన్నవాడు కావడమేననీ తనకు తెలుసు. తెలిసీ, కావాలని అంది, కవ్వించాలని.

ఆ మాటతో భాస్కరం చలించాడు. పొంగి వచ్చే కోపాన్నీ ఉక్రోషాన్నీ అణుచుకునేందుకు వ్యర్థ ప్రయత్నం చేస్తూ, "మంచిగా ఉండటం కష్టంగా ఉంది రాధా!......నీ స్నేహితురాళ్ళంతా



ఆరవిచ్చిన కమలాలు ఫోటో—అచంట బాలప్రసాద్ (పార్వతీపురం)

నన్నెప్పుడో ఈ మాటన్నారు. నువ్వు ఆలోచించి ఆలోచించి ఈనాడు అంటున్నావు....మంచిదే..." అన్నాడు. తరవాత ఎక్కువసేపు కూచోలేదు. వెళ్ళిపోయాడు. ఆ వెళ్ళటం వెళ్ళటం, ఎంత గాయం తగిలిందో, ఎంత నొచ్చుకున్నాడో పాపం, వారం రోజులదాకా తనకు కనబడలేదు.

ఆ వారం రోజుల తరవాతైనా, ఒక్కసారి వచ్చాడు. అదీ, తను రామ్మూర్తిని చేసుకోబోతూందని తెలిసినప్పుడు. వస్తే తనేమన్నా మృదువుగా మాట్లాడితేనా? గుండెల్లో గునపాలు గుచ్చి పంపింది. వెళ్ళిపోయాడు. అంతే. ఆ వెళ్ళిపోవటం—మళ్ళీ తన జీవితంలోకి రాలేదు.

అప్పుడు అమ్మ కూడా చెప్పింది, ఈ సంబంధం వద్దని. మళ్ళీ ఆలోచించుకోమంది. తను విన లేదు. ఓరోజున సుబ్బులు వచ్చి "ఏం నిర్ణయించుకున్నా?" నంటే, "రామ్మూర్తిని చేసుకుందామని" అంది తను.

"ఘన కార్యం చేశావు" అంది సుబ్బులు. ఆ మాటల్లో తనమీద అసహ్యం ఉట్టిపడుతూంది.

"నీకు అసూయ" అంది తాను.

"అవును. అసూయగానే కనిపిస్తుంది నీకు. కాని, నిన్ను నమ్ముకున్న నేరానికి ఆ వెర్రివాడు భాస్కరం పడే మనోబాధ నీ కేం తెలుస్తుంది? ....ఛా! నీకన్నా శిలనయం!" అంది సుబ్బులు. తాను ఆశ్చర్యపడ్డది, భాస్కరాన్ని చిన్నతనంనుంచీ రౌడీ అంటున్న సుబ్బులు కూడా అతడి పక్షం మాట్లాడుతున్నందుకు. ఆనాడు సుబ్బులు మాట విని ఉన్నా తన కథ ఇలా జరక్కపోను! తన బ్రతుకిలా చీకటిలో మలుపుతిరక్కపోను!

మళ్ళీ ఈనాటికి భాస్కరం వస్తున్నాడు. తన జీవన రాగం పూర్తిగా శ్రుతి తప్పిపోయాక వస్తున్నాడు....పోదా మరి? నిర్మలమూర్తిఅయిన ఒక వ్యక్తి అమాయికంగా హృదయంలో పెంచుకుంటున్న ప్రేమలతను సమూలంగా పెరికివేసే అధికారం ఎవ్వరిచ్చారు తనకు? తను అలా పెరికివేసిన ప్రేమలత ఉరిత్రాడై తననే నరక కూపంలో తెచ్చి పడేసింది. ఇది రామ్మూర్తితో జీవితం—తను వలచిన వధ్యశిల!

గది తలుపుతీసి బయటికి చూచింది రాధ. సాయంకాలమయింది. రాధ ఆశ్చర్యపడింది.గతాన్ని తవ్వుకుంటున్న తనకు ఇప్పటిదాకా వర్తమానమే ధ్యాసలోకి రాలేదు! తను మధ్యాహ్నం భోజనం చెయ్యలేదు. ఆ విషయం పట్టించుకున్నవాళ్ళు లేరు ఈ ఇంట్లో.

సాయంత్రపు చల్లగాలి కోతపడిన హృదయాలను అతికించ ప్రయత్నిస్తున్న దానిలా ఉంది. వీధి పొడుగునా బిక్కు బిక్కు మంటున్న విద్యుద్దీపాలు, చంద్రుడి గుడ్డి వెన్నెలతో సహవాసం చేసి సృష్టించే ఎర్రని, పసుపు రక్త జీవనకాంతులు పడుగు పేకల్లాగా అంతటా వ్యాపిస్తున్నాయి. రాధ గది బయటికి వచ్చి పిట్టగోడ దగ్గర కూచుంది. గడియారంలో ముళ్ళు తిరుగుతున్నాయి.

రాధ ఊపిరి బిగబట్టి వీధిలోకి చూస్తూంది. మళ్ళీ ఈ రాత్రి బండికే తాను వెళ్ళిపోవాలని భాస్కరం ఇచ్చిన టెలిగ్రామును రాధ మరిచిపోలేదు. అందుకే ఎదురుచూస్తూ కూచుంది. రాత్రి రైలు తొమ్మిదిన్నరకు. భాస్కరం వెళ్ళాలంటే దానికే వెళ్ళాలి. అతడు స్టేషన్‌కు ఇదే దారిన వెళ్ళాలి.

గడియారం తొమ్మిది కొట్టింది.

అనుకున్నట్లే మరి కాస్సేపట్లో భాస్కరం ఆ దారినే వచ్చాడు. వెంట ఎవ్వరూ లేరు. అతడొక్కడే నడిచిపోతున్నాడు. బ్యాగ్ చేత పట్టుకుని, అమాయికంగా ఏమాత్రం గర్వం లేకుండా నడిచిపోతున్నాడు. మొహం స్పష్టంగా కనిపిస్తూంది, వీధి దీపాల వెలుగులో.

రాధ కళ్ళమ్మట రెండు నీటి బొట్లు జారినయ్.

అతడు తన చిన్ననాటి స్నేహితుడు! అతడి హృదయంలో ఒకప్పుడు తనకు స్థానం ఉండేది. ఆ స్థానం స్వర్ణపీఠం లాంటిది. దాన్ని తను కోల్పోయింది. ఇక దాన్ని మరెవతో అపరిచితురాలు ఆక్రమించుకుంటుంది.

భాస్కరం నడిచి వెళ్ళుతున్నంత దూరమూ అలా కళ్ళు ఇంత చేసుకుని చూస్తూనే ఉంది రాధ......అదిగో, లైట్ల వెలుతురులో నల్లని నీడై కదిలిపోతున్నాడు తన బాల్య మిత్రుడు..... అదిగో, వీధి మలుపు తిరగబోతున్నాడు. మలుపు తిరిగితే ఇక తనకు కనపడడు. జీవితంలో మలుపులాగే ఈ వీధి మలుపు కూడా తననూ, భాస్కరాన్నీ విడదీస్తూంది! ★